# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## శ్లోక జ్ఞానానికి స్వర్ణ పతకం

### - గరిడేపల్లి ముద్దుబిడ్డకు అరుదైన గౌరవం



**హుజూర్ నగర్ ( గరిడేపల్లి )మే 19 ( నినాదం న్యూస్):**
శ్రద్ధ వున్నదే శ్రేయస్సు శ్రమిం చినదే విజయ మకుటం" అనే సామెతకు జీవింత సాక్ష్యంగా నిలిచింది గరిడేపల్లి గ్రామానికి చెందిన ముద్దుబిడ్డ పోలిశెట్టి లక్ష్మి. మైసూరు నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన సచ్చిదానంద ఆశ్రమంలో నిర్వ హించబడిన పరీక్షలో భగవద్గీత పారాయణ స్పర్ధలో 780 శ్లోకాలను అర్థంతో పాటు స్పష్టతగా, భావప్రకాశంగా చదివి ఉత్తమ శ్రేణి గా ప్రథమ స్థానంలో గెలిచారు. సచ్చితానంద స్వామి చేతులు మీదుగా గోల్డ్ మెడల్ ను, సర్టిఫికెట్ను పొందారు. పరమపవిత్రమైన గీతా గ్రంథాన్ని కంఠస్థం చేయడమంటే మానసిక స్థైర్యం, ఆధ్యాత్మికత, శ్రద్ధ, అనురక్తి కలయిక చేయడమే. సమాజంలో నలుగురికీ ఆదర్శంగా నిలిచిన లక్ష్మి ఆమె భర్త పోలిశెట్టి శ్రీనివాస్ ప్రోత్సాహం, తోడ్పాటు ఈ సాధనకు అగ్ర స్థాయిగా నిలిచింది. లక్ష్మి కీర్తిశేషులు పోలిశెట్టి లక్ష్మీనరసయ్య స్వరాజ్యం దంపతుల కోడలు లక్ష్మి ఆదర్శమైన కుటుంబానికి చెందినవారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత భగవద్గీత వైభవాన్ని తెలుసుకోవాలని సూచించారు.

## డిప్రెషన్‌లో వివాహిత ఆత్మహత్య

### -పిఎస్‌లో ఫిర్యాదు చేసిన తల్లి



**జవహర్ నగర్, మే 19 ( నినాదం న్యూస్ ):**
భర్త చనిపోవడంతో డిప్రెషన్ కు లోనైన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ రచన గ్రామర్ స్కూల్ దగ్గర గొల్లూరి వినయ్ కుమార్ భార్య భవాని (27) దంపతులు నివసిస్తున్నారు. భవాని భర్త అనారోగ్యంతో 20 రోజుల క్రితం మరణించాడు. అప్పటినుండి గొల్లూరి భవాని భర్త చనిపోయిన బాధలో డిప్రెషన్ తో బాధపడుతూ ఉంది. ఈనెల 16వ తేదీన సికింద్రాబాద్ లో ఉన్న తల్లి గారింటికి తన రెండు సంవత్సరాల బాబుతో వెళ్లి బాబును అక్కడనే ఉంచి సోమవారం ఉదయం ఏడు గంటలకు బాలాజీ నగర్ కు వచ్చింది. భవాని తల్లి రాజమణి కూతురు గురించి ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఈ మేరకు ఆమె ఎదురింటి వారికి ఫోన్ చేసి కూతురు ఇంట్లోకి వెళ్లి చూడమని చెప్పగా చందు అనే వ్యక్తి వెళ్లి డోర్ లోపల నుండి గడియ వేయబడి ఉన్నదని తెలుసుకొని పక్కన ఉన్న మరో డోర్ ను గట్టిగా నెట్టడంతో డోరు ఓపెన్ అయి వెళ్లి చూడగా భవాని హాల్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు చున్నీ తో ఉరి వేసుకొని ఉంది. చుట్టుపక్కల వాళ్ళ సహాయంతో భవానిని కిందికి దించి 108 అంబులెన్స్ పిలిపించగా పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది భవాని చనిపోయిందని తెలిపారు. ఈ మేరకు భవాని తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే సుందరయ్యకు ఘన నివాళి.

### -దేశంలో విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలి

### - సుందరయ్య 40వ వర్ధంతి సభలో నున్నా



**ఖమ్మం, మే 19 ( నినాదం న్యూస్):**
సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.ప్రకాష్ అధ్యక్షతన దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, పేదల పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి జరిగింది. మొదట సుందరయ్య విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా విప్లవజోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా జోక్యాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. భారత్, పాకిస్థాన్ కంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎలా ప్రకటన చేశారో వివరించాలని కేంద్రాన్ని కోరారు. భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సమస్యలపై మూడో పక్షం మధ్యవర్తిత్వం వహించడం అవాంఛనీయమని అన్నారు. ట్రంప్‌కు మోడీ దాసోహమైనట్లు వివరించడం సిగ్గుచేటన్నారు. దేశీయంగా ఉన్న సమస్యలను పొరుగు దేశాలతో ఉన్న సమస్యలను అంతర్జాతీయం చేయడం ఆమోదయోగ్యం కాదని, పొరుగు దేశాలతో నెలకొన్న సమస్యలను చర్చల ద్వారా పరస్పరం ఆమోదయోగ్యమైన పద్ధతిలో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కాల్పుల విరమణపై అందరికంటే ముందుగానే అమెరికా అధ్యక్షుడు ఎలా ప్రకటించారో ప్రభుత్వం వివరణ పార్లమెంట్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాల్పులకు విరమణకు, దేశ భద్రతకు సంబంధించిన అంశాలు, ఆందోళనలను పరిష్కరించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో నెలకొన్న విద్వేష రాజకీయాలను తిప్పికొడుతూ, సామరస్య జీవనాన్ని కాపాడటమే సుందరయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. పార్టీ విధానం పట్ల వినయ విధేయతలు, నిరాడంబర జీవితం, ఎల్లప్పుడూ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండటం వలన సుందరయ్య అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడయ్యాడని అన్నారు. ప్రజల మనిషిగా, ప్రజల కోసం చివరి వరకూ జీవించి ప్రజా పోరాటాలకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు, సామాజిక పోరాటాలకు, సేవా కార్యక్రమాలకు కూడ అంతే ప్రాధాన్యతను సుందరయ్య ఇచ్చాడని అన్నారు. శ్రమను గౌరవించే సమాజం ఏర్పాటుకు అవిరళ కృషి చేసారని, స్త్రీలను కించపర్చడం, కులాధిక్యత భావాలను ఉపయోగించుకొని దళితులను, బలహీనవర్గాలను పీడిరచే చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో పార్టీని, కార్యకర్తలను కాపాడుకోవటంలో వివిధ ఎన్నికల సందర్భంగా వచ్చిన ప్రతికూల ఫలితాలలో సైతం కార్యకర్తలను నిలబెట్టడంలో సుందరయ్య కీలకపాత్ర పోషించారన్నారు. మార్క్సిజం పట్ల ఎంచుకున్న లక్ష్యం పట్ల సుందరయ్య స్పష్టతతో వుండి ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. పార్టీని, ప్రజా సంస్థలను, సంఘాలను పోరాట కార్యక్రమాలతో పాటు, ప్రజాసంక్షేమం, సేవా కార్యక్రమాలు చేయాలని, సుందరయ్య చూపిన బాటలో పయనం చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తూ దళితులపైన, మైనార్టీలపైన దాడులు చేస్తున్నదని అన్నారు. దేశానికి మతతత్వ రాజకీయాలు చేటు అని ఆరోజే చెప్పారని, నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రతి అంశాన్ని, చివరకు ఉగ్రవాద దాడులను కూడా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నాయని, రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించటమే సుందరయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పి. సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, యం.సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రం, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, బండారు రమేష్, నందిపాటి మనోహర్, తుమ్మ విష్ణువర్ధన్, మెరుగు రమణ, జిల్లా నాయకులు పగడాల నాగేశ్వరరావు, జి.సుధాకర్, ఎస్.డి.జావీద్, టి.ప్రవీణ్, వీరారెడ్డి, జిల్లా ఉపేందర్, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఎస్.కె.అఫ్జల్, నెల్లూరి వీరబాబు, వాసిరెడ్డి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## తరుగు పేరుతో రైతులకు కుచ్చుటోపి పెడుతున్న మిల్లర్లు

- మంత్రి ఆదేశాలనే విస్మరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు
- రైతులను ఇబ్బంది పెడితే సహించం
- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, మే 19(నినాదం న్యూస్)**
రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను సివిల్ సప్లయ్ అధికారులు విస్మరిస్తున్నారని, రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టరును కలిసి మిల్లర్లు చేస్తున్న దోపిడిపై వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లర్ల ఆగడాలు అధికమయ్యాయని, ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా స్థాయి అధికారులతో జరిపిన సమీక్ష సమావేశాన్ని సైతం మిల్లర్లు బేఖాతర్ చేశారని మండిపడ్డారు. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష చేసిన తర్వాత కూడా మిల్లర్లు రైతులను తరుగు పేరుతో మోసం చేస్తున్నారంటే వారికి సివిల్ సప్లయ్ అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. చిట్యాల గ్రామానికి చెందిన మాల బాలస్వామి అనే రైతు తను పండించిన 872 బస్తాల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని, కొనుగోలు చేసినప్పుడే రైతు నుండి తరుగు పేరుతో బస్తాకు 1200 గ్రాముల చొప్పున అధికంగా తూకం చేయడం జరిగిందన్నారు. కానీ కేతేపల్లి కి చెందిన మైరూన్ అనే రైస్ మిల్లు యజమానులు రైతుకు 835 బస్తాలకే లెక్క కట్టి, 37 బస్తాలు తగ్గించి రసీదు ఇవ్వడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. శ్రీలక్ష్మి రైస్ మిల్ యజమాని కూడా ఆరేపల్లికి చెందిన మహబూబ్ అనే రైతు వద్ద క్వింటాలుకు ఐదున్నర కేజీలు అదికంగా తరుగు తీశారన్నారు.

రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇవ్వాల్సిన ట్రక్ షీట్ ఇవ్వకుండా రైస్ మిల్లు దగ్గర ఇస్తున్నారని, ఈ విధమైన నిర్ణయాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిధంగా చాలా మిల్లర్లు నిబంధనలకు విరుద్ధంగా తరుగు తీస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి లోపాయికారిగా వత్తాసు పలుకుతున్న సివిల్ సప్లయ్ అధికారుల పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు రోజుల క్రితం మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ జరిపిన సమీక్ష సమావేశానికి కనీస విలువ చూపని మిల్లర్లపై ఏమి చర్యలు తీసుకుంటారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోటూరి రవీందర్, ఉపాధ్యక్షుకు రేనట్ల మల్లేష్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, రవి నాయుడు, రైతులు చిట్యాల బాలస్వామి, ఆరేపల్లి మహబూబ్, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు

## మహా కుంభమేళా ఉత్సవంలో పాల్గొన్న మాజీ జడ్పిటిసి పైడి



**దమ్మపేట, మే 19(నినాదం న్యూస్):**
శ్రీ సపరి వారి సామెత ఆత్మలింగేశ్వర స్వామి వారి సపహా జీర్ణోదరణ పూర్వక ప్రతిష్ట మహా కుంభమేళా మహోత్సవంలో ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు జిల్లా ప్రముఖులు కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములుతో కలిసి జిల్లా సీనియర్ నాయకులు దమ్మపేట మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నూతనంగా ప్రతిష్ట చేయనున్న ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు పైడన్న వెదురు బొంగులతో ప్రారంభించిన గుడి నేడు ఎంతో అభివృద్ధి చెంది కుంభాభిషేకం చేసేవరకు వచ్చిందని ఆనాటి స్మృతులను గుర్తు చేసుకొని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ జెడ్పిటిసి పైడి మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో నాటి నుండి నేటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. మహాశివుడి ఆశీస్సులతో జిల్లా అభివృద్ధిలో ముందుకెళ్లడానికి మంత్రి తుమ్మలకు మరింత శక్తిని ఇవ్వాలని, అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా శివయ్య ఆశీస్సులు అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, జిల్లా నాయకులు ధర్మసోత్ ఉపేందర్ నాయక్, ములకలపల్లి బీసీ సంఘ నాయకులు, సురభి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల వివక్ష తగదు

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు దళితులే
- సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్



**కుత్బుల్లాపూర్, మే 19 (నినాదం న్యూస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల వేతనాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువమంది దళితులేనని, వారి వేతనాలు ప్రభుత్వం పెండింగ్ లో పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం వీరి పట్ల వివక్ష చూపటం అమానుష చర్య అన్నారు . ప్రభుత్వము, అధికారులు దళిత ఉద్యోగుల వేతనాలు పెండింగ్ పెట్టడం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద ఎందుకు రాదు అని ప్రశ్నించారు. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ మా స్థాయిలో మేము ప్రయత్నం చేస్తున్నామని స్టేట్ ఫైనాన్స్ వద్ద ఫైల్ పెండింగ్ ఉన్నదని అది ప్రభుత్వం ఎంత త్వరగా క్లియర్ చేస్తే అంత త్వరగా వస్తుందని వాపోయారు. క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల ఉన్నతాధికారులు, ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చిన్నచూపు చూడటం సరికాదన్నారు. సిఐటియుగా కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల వేతనాలు పెండింగ్ బాధ్యత ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర ఆర్థిక మంత్రి సామాజిక వర్గం కూడా దళిత సామాజిక వర్గమేనని , పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టు ఉద్యోగుల కష్టాలను గుర్తించి కార్మికులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు పంపిణీ చేయవలసిన సబ్బులను ప్రతి ఆరు నెలలకు ఒకసారి సబ్బులు, కొబ్బరినూనెను, చీపుర్లు పంపిణీ చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. డ్యూటీలో ఉన్న కార్మికులకు ప్రమాదం జరిగినప్పుడు పనికి రాలేనన్ని రోజులు వేతనం కట్టి ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పే స్లిప్పులు, ఐడి కార్డులు వెంటనే ప్రిపేర్ చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, రాముడు లింగమ్మ అలివేలు లక్ష్మీ మనీ సుగుణమ్మ పాల్గొన్నారు.

## ఎస్‌టిపిపిలో అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే




**చెన్నూర్ మే 19 (నినాదం న్యూస్) :**
జైపూర్ మండల కేంద్రంలోని ఎస్ టి పి పి లో సోమవారం అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే ను నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు బీపి, బిఎంఐ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్ టి పి పి ఈడి చెన్నకేశవుల చిరంజీవులు, జి ఎం (ఈఅండ్ఎం) కే శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న హైపర్ టెన్షన్ కేసులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపి, నివారణ మార్గాలను వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బిపి చెకప్ చేయించుకోవాలన్నారు. సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఉన్నట్లయితే ఆ వ్యక్తులు ఆహారంలో ఉప్పు తగ్గించి, వాకింగ్ తో పాటు వ్యాయామం అలవాటు చేసుకుని, జంక్ ఫుడ్ తగ్గించి, వారి జీవనశైలిలో ఈ మార్పులను చేసుకొని నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్సు) మురళీధర్, ఏజీఎం (ఈ అండ్ ఎం) మదన్మోహన్, డిజీఎం (సోలార్) ఎస్. శ్రీనివాస్, డీజీఎం (సివిల్) అజాజుల్లా ఖాన్, డిజీఏం పర్సనల్ అజ్మీరా తుకారాం, 800 మెగావాటు కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఎం.వి. వేణుగోపాలరావు, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఉన్నట్టా, లేనట్టా?



**భీమదేవరపల్లి మే19 (నినాదం న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుందా లేదా అనే దాని పైన రైతులకు ఖచ్చితమైన వివరణ ఇవ్వాలని బిఎస్పి మండల అధ్యక్షుడు బుసమల్ల రాజు అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో బిఆర్ఎస్ నియంతృత్వ పాలనను వద్దనుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పేరిట పాలన కొనసాగిస్తున్నానని ప్రకటించారు. రైతు భరోసా పథకంలో భాగంగా గత యాసంగి సీజన్ కు సంబంధించి ఇప్పటికీ మూడు ఎకరాల వరకే పెట్టుబడి సాయం అందించి మే 23 నుండి 4,5 ఎకరాల రైతులకు అందిస్తామని ప్రభుత్వం నుంచి ప్రకటనలు వస్తున్నాయి. కానీ వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో వానకాలం పంటకు రైతు భరోసా ప్రభుత్వం ఇస్తుందా లేదా అన్న విషయంపై ఇప్పటికీ ప్రభుత్వ వర్గాల నుంచి కానీ ముఖ్యమంత్రి నుండి గాని ఈ రకమైన హామీ ప్రకటనలు రాకపోవడంతో రైతాంగం అంతా అసలు రైతు భరోసా పథకం ఉంటుందా ఉండగా అని అయోమయంలో ఉన్నారని అన్నారు. ఎన్నికలలో హామీ ఇచ్చేముందు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు తెలవకుండానే ఎందుకు అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టారని అలాంటి హామీల విషయంలో ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు.



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మల్కాజిగిరి మండల కార్యదర్శిగా నాలుగోవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన టి. యాదయ్య గౌడ్.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని లేదంటే ప్రజా పోరాటాలు నిర్మాణం చేస్తామని చెప్పారు.

-మేడ్చల్ మల్కాజిగిరి, నినాదం న్యూస్

## హుజరాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి బదిలీ



**జమ్మికుంట, మే 19 (నినాదం న్యూస్) :**
హుజూరాబాద్ ఏసిపి గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ శ్రీనివాస్ జి ని బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర డిజిపి కార్యాలయం నుండి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు వెళ్లడయ్యాయి. శ్రీనివాస్ జి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఏసీపీ గా మాధవి రానున్నారు.

## అక్రమ ఇసుక రవాణాపె ప్రజావాణిలో ఫిర్యాదు



**చెన్నూర్ మే 19 (నినాదం న్యూస్) :**
జైపూర్ మండలం ఇందారం ఇసుక రీచ్ నుండి అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు స్థానిక గ్రామస్తుడు షేక్ షరీఫ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణిలో డిప్యూటీ తాసిల్దార్ మాధవికి ఫిర్యాదును అందించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పేరిట మండల అధికారుల నుండి పర్మిషన్ లెటర్లను అడ్డుపెట్టుకొని గంగిపల్లి ట్రాక్టర్ యజమానులు అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇందారం గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్ ను అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఆ ఇసుక రీచ్ నుండి మన ఇసుక మన వాహనం యాప్ ద్వారా ఆన్లైన్లో అనుమతి పొంది ఇసుకను తరలించాలి, కానీ స్థానిక మండల పరిధిలోని వివిధ గ్రామాలకు ఇసుకను తరలిస్తూ, అధిక ధరలకు విక్రయించి ఇసుక అక్రమార్కులు జీరో దందా కొనసాగిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. మండలంలోని ఇసుక దోపిడీ పై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**దమ్మపేట, మే 19(నినాదం న్యూస్):**
మండల పరిధిలోని మందలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మందలపల్లిలో 33 కెవి మరమత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ విద్యుత్ వినియోగదారులు, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

## వైన్స్ ముందు వీరంగం.. ముగ్గురిపై కేసు నమోదు

**వెల్గటూర్, మే19(నినాదం న్యూస్):**
ఉమ్మడి వెల్గటూర్ మండలం లోని ఎండపల్లి గ్రామంలో సోమవారం ఉదయం మహాలక్ష్మి వైన్స్ సిబ్బందితో పలువురు గొడవ పడిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు జరిగిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజున మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ పల్లి గ్రామానికి చెందిన బొడ్డు రాజేష్, సబ్బు రాజేష్, వాసు అనే ముగ్గురు వ్యక్తులు మద్యం దుకాణానికి వచ్చి మద్యం కొనుగోలు విషయంలో సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి వచ్చారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం రేట్లు పెరిగాయని చెప్పినా వినకుండా సిబ్బందిపై దాడికి యత్నించి, లోపలికి చొరబడి షట్టర్ లు మూసి వారిని నిర్బంధించి చంపుతామని బెదిరించారు. సిబ్బందిని నానా దుర్భాషలదుతూ.. చంపుతామని బెదిరించడంతో.. సదరు వ్యక్తులపై వైన్స్ నిర్వాహకుడు గట్టపల్లి శ్రీరామ్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.